క్లుప్తంగా

బాధితుడికి ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయాన్ని అందజేస్తున్న శ్రీనివాసులునాయుడు

గూడూరు: విద్యుత్ ప్రమాదానికి గురై మంచానికే పరిమితమైన సురేష్‌కు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీనివాసులునాయుడు శనివారం ఆర్థికసాయం అందించారు. దివిపాళెం గిరిజన కాలనీకి చెందిన తిరుమలశెట్టి సురేష్ విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు పైనుంచి కిందపడ్డాడు. దీంతో అతని వెన్నెముక దెబ్బతినడంతో రెండేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. దీంతో కుటుంబ పోషణ భార్యపై పడింది. అలాగే మానసిక దివ్యాంగురాలైన సోదరి కూడా అతని వద్దే ఉండడంతో, ఆ కుటుంబానికి పూట గడవడమే కష్టంగా మారింది. విషయం తెలిసి శ్రీనివాసులునాయుడు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తన వంతుగా రూ.20 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. అలాగే అతని వైద్యనిమిత్తం తమ వంతుగా ఆదుకుంటామని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. ట్రస్ట్ సభ్యులు బాబు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు, స్టీల్ ప్లేట్లు పంపిణీ చేస్తున్న రత్నశ్రీ

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని దేశమ్మగుంట గిరిజన కాలనీలో నివాసముంటున్న నిరుపేద గిరిజనులకు శనివారం సాయంత్రం స్థానిక వైఎస్సార్‌సీపీ మహిళా విభాగ రాష్ట్ర కార్యదర్శి ఈదా రత్నశ్రీ దుప్పట్లు, స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. మహాశివరాత్రి సందర్భంగా తన వంతుగా 100 మందికి దుప్పట్లు, ప్లేట్లు అందించారు. కాలనీలో ఉన్న పిల్లలందరికీ బిస్కట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం నెల్లూరు జయరామయ్య, అరుణ, పసల శ్రీనివాసులు, మారంరెడ్డి ముత్యాలరెడ్డి, దువ్వూరు హరాతిరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

తమిళ రేషన్ బియ్యం పట్టివేత

తడ: తమిళనాడు నుంచి ఆంధ్రాకి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వారిపై తిరుపతి విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. అక్కంపేట మోడల్ స్కూల్ సమీపంలోని లేఔట్‌లో ఖాళీ ప్రదేశంలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్టు అందిన ఫిర్యాదు మేరకు తడ సీఎస్‌డీటీ ఓబయ్య, తిరుపతి విజిలెన్స్ అధికారులు కలిసి దాడి చేశారు. ఆ సమయంలో వాటంబేడు గ్రామానికి చెందిన మీజూరు హరనాథ్‌రెడ్డి వద్ద 25 బస్తాల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. అదే సమయంలో చెన్నైకి చెందిన దాసరి నాగరాజు ప్రయాణికుల ఆటోలో 18 బస్తాల బియ్యం తీసుకుని సంఘటన స్థలానికి వచ్చాడు. అతనిని విచారించిన అధికారులకు ఈ బియ్యం చంద్రారెడ్డికి రెగ్యులర్‌గా విక్రయిస్తానని తెలపడంతో ఇద్దరినీ అరెస్ట్ చేసి పట్టుబడ్డ బియ్యాన్ని కొండూరు సివిల్ సప్లయీస్ గోడౌన్‌కు తరలించి, నిందితులను, ఆటోను తడ పోలీసులకు అప్పగించారు. పట్టుబడ్డ బియ్యం విలువ లక్షా 40 వేలు ఉంటుందని అధికారులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఓజిలి: మండల పరిధిలోని ఆర్మేనిపాడు గ్రామంలో శ్రీసాయిఫిల్లింగ్ స్టేషన్‌లో పేకాట ఆడుతుండగా ఇన్‌స్పెక్టర్ ఆర్‌వీఎస్ ప్రసాద్ శనివారం దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఐదుగురు పేకాటరాయుళ్ల నుంచి రూ.22,900 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, రెండు మోటార్ బైక్‌లు స్వాధీనం చేసుకుని ఓజిలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ దాడులలో ఎస్‌ఐ దారం ఆదిలక్ష్మి, హెచ్‌సీ నాగరాజు, శాబ్ సిబ్బంది రమణయ్య, వెంకటేశ్వర్లు, సురేష్ పాల్గొన్నారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్ట్

వెంకటగిరి: పట్టణంలోని మాసాపేట ప్రాంతంలో శనివారం రాత్రి ఎస్‌ఐ జిలానీబాషా ఆధ్వర్యంలో జరిపిన దాడుల్లో ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4,200 నగదు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీని ఢీకొన్న ఆటో

- ఆటోడ్రైవర్‌కు గాయాలు

నాయుడుపేటటౌన్: లారీని ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. మండల పరిధిలోని కూడివాడ పాళెం గ్రామానికి చెందిన రమేష్ నాయుడుపేట పట్టణంలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి విధులను ముగించుకుని ఆటో తీసుకుని గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో పట్టణ పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో రహదారిపై ఎదురుగా వస్తున్న లారీని అదుపుతప్పి ఆటో ఢీకొంది. ఈ ఘటనలో ఆటో నడుపుతున్న రమేష్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ అతన్ని స్థానికులు స్పందించి రమేష్‌ను ఆటోలోంచి బయటకు తీసి అంబులెన్స్‌లో పట్టణంలోని ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని పరిశీలించారు. ఎస్‌ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హర హర మహాదేవ



ధనమల్లి ఆలయంలో..



నాగేశ్వరస్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



గూడలి సంగమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

- వాడవాడలా మహాశివరాత్రి వేడుకలు
- శివ నామస్మరణతో మార్మోగిన శివాలయాలు

గూడూరు: హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తుల శివనామ స్మరణలతో శైవాలయాలు మార్మోగాయి. మహా శివరాత్రి సందర్భంగా శనివారం పట్టణంలోని భూదేవీ సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయం, త్యాగరాజ వీధిలోని సోమలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అనంతరం అన్నదానం చేశారు. రెండవ పట్టణంలోని చింపిరినాయుడు పేట ప్రాంతంలోని కామాక్షీ సమేత ఉమామహేశ్వరాలయంలో శివపార్వతులకు కల్యాణాన్ని కోలాహలంగా నిర్వహించారు.

సైదాపురంలో..

సైదాపురం: శ్రీసిద్ధలయ్య కోనతో పాటు సైదాపురం శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

దొరవారిసత్రంలో

దొరవారిసత్రం: శ్రీధనమల్లి, ఉచ్చూరు, అక్కరపాక, దిగువమేలుపాక, వేణుంబాకంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి అన్నదానాలు చేశారు.

నాయుడుపేటలో..

నాయుడుపేటటౌన్: మండలంలోని శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు కోలాహలంగా జరుపుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

దక్కిలిలో..

దక్కిలి: మండలంలోని శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవమూర్తులు శివ పార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

తడలో..

తడ: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతూ శినామ స్మరణతో మార్మోగిపోయాయి. మాంబట్టులో వెలసిన శ్రీ గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఎం కండ్రిగ గ్రామానికి చెందిన కామిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబసభ్యులు రూ.10లక్షల వ్యయంతో ఆలయం లోపల గ్రానైట్‌తో సుందరంగా తీర్చి దిద్దారు. గ్రామానికి చెందిన బట్టా రాజేశ్వరి, రామచంద్రన్ దంపతులు లక్ష విలువ చేసే రెండు బంగారు మంగళసూత్రాలను అమ్మవారికి అందజేశారు.

వాకాడులో..

వాకాడు: మండలంలోని శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మారుమోగాయి. ఆయా ఆలయాలను శోభాయమానంగా అలంకరించి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష అభిషేకాలు, కల్యాణం, అన్నదానాలు, ఉత్సవాలు నిర్వహించారు.

ఓజిలిలో..

ఓజిలి: మండలంలోని శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శివపార్వతుల కళ్యాణంను కనులపండుగగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

రాపూరులో..

రాపూరు: మండలంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. స్వామిఅమ్మవార్ల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు.

వెంకటగిరిరూరల్: మండలంలోని పలు శివాలయాలల్లో మహాశివరాత్రి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. వేద పండితులు మంత్రోచ్ఛరణలతో స్వామివారికి హోమాలు, అభిషేకాలు, కల్యాణం నిర్వహించారు. అన్ని శివాలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు. అదేవిధంగా బాలాయపల్లి మండలంలో వేడుకగా నిర్వహించారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు శివనామస్మరణతో మారుమోగాయి. స్వామి వారికి పలు రకాల అభిషేకాలు చేసి కల్యాణం జరిపించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట: పట్టణంలోని గంగా పార్వతి త్రినేత్ర సంభూతుడైన నాగేశ్వరాలయంలో జరుగుతున్న పంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో శనివారం వేకువజామునుంచి స్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆలయానికి విచ్చేసి దర్శనం చేసుకున్నారు. మన్నారుపోలూరు బీసీ కాలనీ సమీపంలో కాళంగినదీ తీరాన వెలసిన శ్రీసంతానేశ్వరస్వామి వారి ఆలయానికి శనివారం వేకువజాము నుంచే భక్తులు వేలాదిగా వచ్చి శివలింగాన్ని కాళంగినదీ జలాలతో అభిషేకించారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి: పట్టణంలోని శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. పురాతన కాశీవిశ్వనాథస్వామి ఆలయం, హరిహరక్షేత్రంలోని కాత్యాయినీ సమేత కైలాసనాథస్వామి దేవస్థానం, రామలింగేశ్వరస్వామి ఆలయం, బంగారుపేట భవానీశంకర ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. శివునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. హరిహరక్షేత్రంలో స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో జరిగిన శివరాత్రి ఉత్సవంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోటలో..

కోట: గూడలి కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. గూడలి కొండపై వెలసిన శ్రీపర్వతవర్ధినీ సమేత భీమేశ్వర స్వామి దేవస్థానంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి భీమేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు.



భీమేశ్వరాలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి



గూడూరు: మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో భక్తులు



గూడూరు: అన్నదానం



సిద్ధలయ్య కోనలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు



సిద్ధలయ్య కోనలో కల్యాణం



నాయుడుపేట: భూపతేశ్వరస్వామి నగరోత్సవం



ఓజిలిలో గ్రామోత్సవం



వల్లివేడులో శివపార్వతుల కల్యాణం



సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో చిన్నారుల నృత్యం



బాలాయపల్లిలో పూజలు అందుకుంటున్న ఈశ్వరయ్యస్వామి



చేడిమాలలో స్వామివారికి పూజలు



మాంబట్టులో ప్రత్యేక అలంకారంలో భక్తులకు కనువిందు చేసిన శివయ్య



కాత్యాయినీ సమేత కైలాసనాథ స్వామివారి కల్యాణం



దక్కిలి: ప్రత్యేక అలంకరణలో స్తంభాలగిరీశ్వరయ్యస్వామి



రాపూరు: సిద్ధిలేశ్వర కోనలో భక్తుల కోలాహలం



సంతానేశ్వరస్వామిని అభిషేకించేందుకు కాళంగినది నుంచి జలం తెస్తున్న భక్తులు

కోడ్ ముగియగానే గడప గడపకు మన ప్రభుత్వం



మాట్లాడుతున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

- తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

వెంకటగిరి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ మార్చి 16న ముగియనుందని, ఆ తర్వాత వెంకటగిరి నియోజకవర్గంలో గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం ప్రారంభిస్తామని తిరుపతి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక నేదురుమల్లి నివాసంలో ఆయన్ను పలు మండలాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ చట్టాలను ఎవరైనా గౌరవించాల్సిందేనని, క్రమశిక్షణ కలిగిన వైఎస్సార్‌సీపీ నాయకత్వం ఖచ్చితంగా ఎన్నికలకోడ్‌ను పాటిస్తున్నట్లు తెలిపారు. మార్చి ద్వితీయార్థంలో నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని వెంకటగిరి మున్సిపాలిటీ, రూరల్, డక్కిలి, బాలాయపల్లి, రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల్లో ప్రతి గడపకూ వెళ్లి నవరత్నాల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వానికి మద్దతు ఇవ్వాలని కోరుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు చెలికం శంకరరెడ్డి, పి ప్రసాద్‌రెడ్డి, న్యాయవాది ఎల్ కోటీశ్వరరావు, మున్సిపల్ లీగల్ అడ్వైజర్ పి. జయప్రకాష్‌జెట్టి, సొసైటీ అధ్యక్షుడు పి.దశరథరామిరెడ్డి, వి.కార్తీక్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎస్ బాలయ్య, కౌన్సిలర్‌లు ప్రభావతి, కె. కృష్ణమూర్తి, ఏ. శ్రీనివాసులురెడ్డి, ఎన్.శేఖర్, ఎస్ గోపాలకృష్ణ, టి.సుబ్బారావు, నేతలు మురళి, టి.గణేష్‌రెడ్డి, ఎస్.కృష్ణయ్య, రాజారెడ్డి, డక్కిలి ఎంపీపీ గోను రాజశేఖర్, ఎం మునిరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గురుకులం వార్షికోత్సవం

దొరవారిసత్రం: దొరవారిసత్రంలోని బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో శుక్రవారం రాత్రి వార్షికోత్సవం, వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జోన్-3 అధికారి అక్కరావు, ఇతర పాఠశాల ఉపాధ్యాయులు మునస్వామి, పరాంధమయ్య హాజరయ్యారు. విద్యార్థులు అర్ధరాత్రి వరకు ఆటపాటలతో హోరెత్తించారు. ప్రిన్సిపల్ తిరుపతయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వార్షికోత్సవం వేడుకల్లో విద్యార్థుల నృత్య ప్రదర్శన

మెగా రక్తదానశిబిరం రేపు

కోట: మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని సోమవారం విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో మెగా బ్లడ్‌క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే రక్తదాన శిబిరాన్ని నేదురుమల్లి ఫౌండేషన్ చైర్మన్, ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మట్టి నమూనా సేకరణ



చిల్లకూరు: జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా చిల్లకూరు మండలం వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో గత నాలుగు రోజులుగా కాంట్రాక్టు సంస్థకు చెందిన వారు మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం వరగలి క్రాస్ రోడ్డు నుంచి తూర్పుకనుపూరు వరకు ఆరు రోడ్ల నిర్మాణాలకు సంబంధించి సర్వేను పూర్తిచేసి భూ సేకరణకు సిద్ధం అవుతుంది. ఈక్రమంలో 16వ నంబర్ జాతీయ రహదారిపై వరగలి క్రాస్‌రోడ్డు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాల్సి ఉంది. దీంతో అక్కడ అనుకూలంగా ఉంటుందా అనే విషయాలను పరిశీలించేందుకు జాతీయ రహదారికి ఇరువైపులా ఎంతమేర గట్టిదనం ఉంటుంది అనే విషయాల కోసం మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. జాతీయ రహదారుల విస్తరణ పనులను చేపడుతున్న మెగా కంపెనీకి చెందిన ప్రతినిధులు ఈ ప్రాంతంలో రోడ్డుకు పక్కనే బోర్లు వేసి మట్టిని సేకరిస్తుండడంపై ప్రతినిధులను ప్రశ్నించగా ప్రతిచోట 60 నుంచి 320 అడుగుల వరకు తవ్వి అక్కడ మట్టి నమూనాలను తీసి పంపుతున్నామని తెలిపారు. పనులు వేగంగా చేపడితే మరో నాలుగేళ్లలో ఈప్రాంతంలో కిమీ మేర ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి అవుతుంది.

గిరిజనుల జీవనానికి అటవీ భూములు

- ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

పెళ్లకూరు: మండలంలోని కానూరు గిరిజనులకు కాలనీల సమీపంలోని అటవీ భూములను మంజూరు చేసేలా చర్యలు చేపడతామని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. శనివారం కానూరు గిరిజన కాలనీకి విచ్చేసిన ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు గిరిజనులతో మాట్లాడారు. ఎంతో కాలంగా అటవీ భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగించే గిరిజనులను అటవీశాఖ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని తమ సమస్యలను వెలగపల్లికి విన్నవించారు. స్పందించిన ఆయన గిరిజనుల సమస్యను ఆ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో అటవీ భూములను ఇప్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ గిరిజన మహిళలకు దుస్తులు అందించి వైఎస్సార్‌సీపీని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. ఆయన వెంట నేతలు వెంకటేశ్వర్లు, రవి, శ్రీకాంత్, చెంగయ్య ఉన్నారు.

ప్రమాద బీమా పెంచిన ఘనత జగనన్నదే



బీమా పత్రాలను తీసుకుంటున్న అనిత

గూడూరు: గీత కార్మికుల ప్రమాద బీమా పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచిన ఘనత ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఈడిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాశిన అనిత పేర్కొన్నారు. ఓజిలి మండలం పెదపరియ గ్రామానికి చెందిన కాల్తిరెడ్డి వెంకటేశ్వర్లు అనే కల్లు గీత కార్మికుడు ఈనెల 15న కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కి అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ మేరకు వెంకటేశ్వర్లు చికిత్స పొందుతున్న ఆస్పత్రికి శనివారం కల్లు గీత కార్మిక సంఘాల నాయకులతో కలసి వెళ్లి, ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనిత మాట్లాడుతూ గతంలో కల్లు గీత కార్మికులను పట్టించుకనే నాథుడే లేడన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక గీత కార్మికులను ఆదుకునేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చారన్నారు. ఈ క్రమంలోనే ప్రమాద బీమాను కూడా రూ.10 లక్షలకు పెంచారని తెలిపారు. వెంకటేశ్వర్లుకు ప్రమాద బీమాను త్వరితగతిన ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని అనిత తెలిపారు. ఆమె వెంట గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిట్టెం శ్రీనివాసులుగౌడ్, నాశిన భాస్కర్‌గౌడ్, తంబయ్యగౌడ్, మల్లికార్జున గౌడ్, మురళిగౌడ్ పాల్గొన్నారు.

రుణాలపై రైతులకు అవగాహన

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట ఎస్‌బీఐ వ్యవసాయ రుణాలు, గ్రామరైతులు, స్వయం సహాయక బృందాలతో కోటపోలూరులో ప్రత్యేక సమావేశాలు అనే అంశంపై శుక్రవారం రాత్రి ఎస్‌బీఐ శిబిరం ఏర్పాటు చేశారు. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రాజేష్‌బాబు మాట్లాడుతూ రాత్రి సమావేశం ఏర్పాటు ఉద్దేశం గురించి తెలియజేశారు. ముఖ్యంగా బ్యాంకులో రుణాలు తీసుకునే రైతులకు అవగాహన కల్పించారు. శుక్రవారం రైతులకు, స్వయం సహాయక బృందాలకు కలిపి రూ.10 కోట్ల రుణాలను విడుదల చేశామని తెలిపారు. బ్యాంకులో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించి మళ్లీ తీసుకుంటున్న ఆదర్శ రైతులు ఆరుగురిని సన్మానించారు. ఫీల్డ్ ఆఫీసర్ మధుసూదన్ పాల్గొన్నారు.